నేడు బాబు పర్యటన ఇలా...

చంద్రబాబు రెండో రోజు పర్యటన ఈ విధంగా సాగనుంది. ఉదయం 11.30 గంటలకు రాయదుర్గంలోని పీజీ కళాశాల వద్ద నుంచి బయలుదేరి 12.30 గంటలకు కౌకుంట్లకు చేరుకుంటారు. అక్కడ పయ్యావుల కేశవ్ కుమారుడు వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి కళ్యాణదుర్గం పయనమవుతారు. సాయంత్రం 4.15 గంటలకు కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్‌కు చేరుకుంటారు. అక్కడ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం టీ సర్కిల్‌కు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొన్నారు. రాత్రి అక్కడే బస చేస్తారు.

నాలుగు నెలలకే.. ఎస్పీ బదిలీ..!

◆ కె.శ్రీనివాసరావు స్థానంలో అన్బురాజన్ నియామకం ◆ కారణలేమిటన్నదే సర్వత్రా చర్చ ?

నూతన ఎస్పీ అన్బురాజన్

బదిలీ ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నాలుగు నెలలు తిరగక్కుండానే అనంతపురం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావును ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీన ఆయన అనంతపురం జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నారు. ఇంకా ఆయన ఈ జిల్లా పరిస్థితులపై పూర్తి స్థాయిలో అవగాహన చేసుకునేలోపై బదిలీ అయ్యారు. ఏ కారణాలతో ఆయన్ను ఇంత త్వరగా బదిలీ చేసారారన్న దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. వచ్చిన ఈ తక్కువ సమయంలో ఆయన మొదటి సొంత శాఖపైనే దృష్టి సారించినట్టు కనిపించారు. సిబ్బందిని చక్కబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు వచ్చే అవకాశాలూ ఉన్న సమయంలో ఎక్కడా ఎటువంటి సమస్య జిల్లాలో తలెత్తకుండా, ఒత్తిళ్లకు తలొగ్గకుండా సిబ్బందితో పనిచేయించే విధంగా చర్యలు చేపడుతున్నట్టు కనిపించారు. ఇంకా అంత పెద్దగా రాజకీయపరంగానూ ఇబ్బందులు కల్పించిన దాఖలాలు లేవు. ఈ ఆలోపే కె.శ్రీనివాసరావును ప్రభుత్వం బదిలీ చేసింది. విశాఖపట్నం డిప్యూటీ కమిషర్ ఆఫ్ పోలీస్ (డిసిపి)గా నియమిస్తూ మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కడప జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న అన్బురాజన్‌ను అనంతపురం జిల్లా ఎస్పీగా నియమించింది.

అన్బురాజన్ కోసమే కె.శ్రీనివాసర్‌రావును మార్చారా..!

కడప జిల్లా ఎస్పీగానున్న కెకెఎన్ అన్బురాజన్‌కు నాలుగు ఏళ్లలో పదవీకాలం పూర్తవుతోంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయన్ను కడప జిల్లా ఎస్పీగా నియమించారు. ఆయన అక్కడ 2019 అక్టోబర్ 12వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. నాలుగేళ్ల పదవీకాలం పూర్తవుతున్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఆయన అక్కడి నుంచి బదిలీ వచ్చే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈయన్ను అనంతపురం జిల్లా ఎస్పీగా బదిలీ చేసి ఉంటుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా తమిళనాడుకు చెందిన కెకెఎన్.అన్బురాజన్ 2011కు సంబంధించిన ఐపిఎస్ అధికారి. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం ఎంటెక్ పూర్తి చేసిన అన్బురాజన్ కొంతకాలం టిసిఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. ఆ తరువాత సివిల్స్‌కు ప్రిపేర్ అయి ఐపిఎస్ అయ్యారు. 2011 బ్యాచ్‌లో ఐపిఎస్ పూర్తి చేసుకుని ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. మొదట గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. చిత్తూరు అదనపు ఎస్పీగానూ, తూర్పుగోదావరి అదనపు ఎస్పీగానూ పనిచేశారు. 2013 నుంచి 2017 వరకు కడప అదనపు ఎస్పీగానూ, పనిచేశారు. 2018లో తిరుపతి అర్బన్ ఎస్పీగా పనిచేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికాంరలోకి వచ్చాక కడప ఎస్పీగా 2019 అక్టోబరులో వచ్చారు. అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు. ఇప్పుడు తాజాగా అనంతపురం ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన సర్వీసులో అత్యధికం రాయలసీమ జిల్లాల్లోనే పనిచేసినందుకు ఇక్కడి పరిస్థితులపై పూర్తి స్థాయి అవగాహనుండనుంది.

డిఆర్‌ఒ గాయత్రీదేవి బదిలీ

కొత్త డిఆర్‌ఒగా రాజశేఖర్ నియామకం

అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారిణి గాయాత్రీదేవిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె స్థానంలో చిత్తూరు డిఆర్‌ఒ రాజశేఖర్‌ను ఇక్కడ నియమించారు. గాయత్రీదేవి చాలాకాలంగా జిల్లాలోనే పనిచేస్తున్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసరుగానూ అనంతరం ఇక్కడే జిల్లా రెవెన్యూ అధికారిగానూ పనిచేస్తూ వస్తున్నారు. ఇప్పుడు ఈమెను జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎస్‌బిలో తాత్కాలికంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు..
◆ సైకో జగన్ పోతేనే రాష్ట్ర భవిష్యత్
◆ అధికారంలోకి వచ్చేది టిడిపినే
◆ 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' యాత్రలో చంద్రబాబు
◆ రాయదుర్గంలో సాగిన మొదటి రోజు పర్యటన

రైతుకు అండగా ఉంటా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, రాయదుర్గం

తీవ్రమైన కరువు పరిస్థితుల్లోనున్న రైతాంగానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హామీనిచ్చారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' యాత్ర మంగళవారం అనంతపురం జిల్లాలో ప్రారంభమైంది. మూడు రోజులపాటు జిల్లాలో జరిగే ఈ యాత్రలో చంద్రబాబు పాల్గొంటున్నారు. మంగళవారం ఉదయం విమానంలో బళ్లారి చేరుకున్న చంద్రబాబు అక్కడ కమ్మ జనసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఓబుళాపురం చెక్‌పోస్టు మీదుగా అనంతపురం జిల్లాలోకి ప్రవేశించారు. పల్లేపల్లి వద్ద వర్షాభావంతో దెబ్బతిన్న వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతోనూ మాట్లాడారు. వర్షాభావంతో వేరుశనగ పంట ఏ మాత్రం వచ్చే అవకాశం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పంట దెబ్బతిన్నా బీమా సరిగా రావడం లేదు. పురుగు మందులు, ఎరువుల ధరలు పెరిగిపోయాయని చంద్రబాబు దృష్టికి రైతులు తీసుకొచ్చారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. అనంతరం సాయంత్రం రాయదుర్గం పట్టణంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అంతేకాకుండా స్థానికంగానున్న సమస్యలను ఎత్తిచూపారు. భైరవానితిప్ప ప్రాజెక్టు ఎత్తిపోతల ద్వారా ఈ ప్రాంతానికి నీరివ్వాలని ఆనాడు తెలుగుదేశం పార్టీ రూ.907 కోట్లతో పనులు చేపడితే దీన్నిఈ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అదే విధంగా ఉంతకల్లు రిజర్వాయర్ నిలిపివేసారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే వీటిని తప్పకుండా పూర్తి చేస్తామని హామీనిచ్చారు. పంటలు ఎండిపోతే తాము అధికారంలోనున్న సమయంలో బీమా,ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. ఈ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీనే ఎత్తివేసిందన్నారు. ఉచిత బీమా పేరుతో రైతులకు పరిహారం సక్రమంగా అందకుండా చేస్తోందన్నారు. బీమా విధానంలో మార్పులు తీసుకొస్తామని హామీనిచ్చారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఇక్కడున్న నేతలు కూడా ఇసుక, మైనింగ్ అన్నింటిలోనూ దోచుకుంటున్నారని ఆరోపించారు. వేదవతి నదిలో ఇసుక ఉన్న ఇక్కడి ప్రజలకు దొరకడం లేదని తెలిపారు. బళ్లారి, బెంగళూరులో ఇక్కడి ఇసుక దొరుకుతోందన్నారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సైకో పాలన వలన రాష్ట్రం అధోగతి పాలైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పుల మయం చేసారని ఆరోపించారు. మద్యం నియంత్రించే ఎన్నికల్లో ఓటు అడుగుతామని ప్రతిపక్షంలో ఉండగా చెప్పారని గుర్తు చేశారు. నియంత్రించకపోగా మద్యం అమ్మకాలపై రూ.14 వేల కోట్లు అప్పు తెచ్చారని చెప్పారు. జాబ్ క్యాలెండర్ అని ప్రకటించి ఉద్యోగ భర్తీ చేయేలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని మోయలేనంతగా ఈ ప్రభుత్వం వేస్తోందన్నారు. సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 దోచేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రానికి రాజధాని అన్నది కూడా లేకుండా చేసారని మండిపడ్డారు. పోలవరంను పూర్తిగా నాశనం చేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో రాబోయే ఆరు నెలల్లో ఏర్పడబోయేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాలలో టిడిపి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే రాయదుర్గం నియోజకవర్గం, రాయలసీమను అపర శ్రీకష్ణదేవరాయల వలె చంద్రబాబు నాయుడు అన్ని రంగాల్లోనూ అభివద్ధి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పరిటాల సునీత, బికె.పార్థసారథి, పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఆలం నరసానాయుడు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో అధికారులు, పాలకులు విఫలం

◆ రెండు బ్రిడ్జీలు కట్టడమే అభివృద్ధా..? : సిపిఎం ◆ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన

కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగారాన్ని అభివృద్ధి చేసి, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, పాలకవర్గం పూర్తిగా విఫలం అయ్యిందని సిపిఎం నాయకులు విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, రెండు బ్రిడ్జీలను కట్టి అదే నగరాభివృద్ధి అనేలా వ్యవహరించడం సరికాదన్నారు. అనంతపురంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మంగళవారం నాడు ధర్నా నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం గేట్లను మూసి ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కజేయకుండా దాదాపు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శిలు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ నగరంలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, పాలకులు వైఫల్యం చెందారన్నారు. శివారు ప్రాంతాల్లో అనేక సమస్యలతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. అనంతపురం నగరం నడిబొడ్డులో ఉన్న సెంట్రల్ పార్కు స్థలం ఆక్రమణను కాపాడలేని పరిస్థితి ఉందంటే ఇక్కడ పరిపాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, ప్రజలపై పన్నుల భారాలు మాత్రం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరం మొత్తం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలన్నారు. నగర విస్తీర్ణంకు అనుగునంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని సూచించారు. తిక్కరంగయ్య స్వామి గుడి నుంచి తపోవనం దారిని వెడల్పు చేసి బాగు చేయాలన్నారు. రిషిత స్కూల్ దగ్గర బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నడిమి వంక సేఫ్టీ వాల్ నిర్మించి వరదల నుంచి కాపాడాలన్నారు. నడిమివంక, మరువవంక, పెద్దవంక పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు వెంటనే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. వీటితో పాటు రోడ్లు, ఇతర ప్రజా సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఆందోళనకారుల వద్దకు కమిషనర్ వచ్చి మాట్లాడారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు వి.సావిత్రి, సిపిఎం జిల్లా నాయకులు వెంకటనారాయణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, ముత్తుజ, వలీ, గోపాల్, బాలకష్ణ, నగర నాయకులు మసూద్, ప్రసాద్, రాజు, గఫూర్, ఎన్టీఆర్ శీన తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే జగన్‌కు గుణపాఠం తప్పదు

◆ విఒఎల సమస్యలను పరిష్కరించాలి ◆ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

డిఆర్‌డిఎ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విఒఎలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ (విఓఏ)ల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి గుణపాఠం తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హెచ్చరించారు. విఒఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ పీడీ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కృష్ణకళామందిరం నుంచి డిఆర్‌డిఎ కార్యాలయం వరకు ర్యాలీ చేట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఓఏలు క్షేత్ర స్థాయిలో చేస్తున్న సేవలతోనే ఉత్తమ అవార్డులు అధికారులు పొందగలుగుతున్నారని తెలిపారు. అలాంటి విఓఏలకు నెలల తరబడి వేతనాలు బకాయిలు పెడితే వారి కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల వైఎస్‌ఆర్‌సిపి పాలనలో పెంచిన రూ.8 వేలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. 15 సంఘాల్లోపు ఉన్న విఓఏలకు వేతనాలు చెల్లించాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. 5జి మొబైల్స్‌ను ఇవ్వాలన్నారు. విఒల మెర్జ్ నిర్ణయాన్ని ఆపాలని కోరారు. ధర్నా వద్దకు డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీ నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. వీరి ధర్నాకు మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మన్నీల రామాంజినేయులు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ, విఓఏల సంఘం నాయకులు దస్తగిరి, పద్మావతి, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

బాధ్యతాయుతంగా రీవెరిఫికేషన్

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఉరవకొండ

స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024లో భాగంగా చేపడుతున్న రీవెరిఫికేషన్ ప్రక్రియను బాధ్యతాయుతంగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. మంగళవారం నాడు ఉరవకొండ మండలం చిన్నముష్టురు, విడపనకల్లు మండలం మాళాపురం, విడపనకల్లు పట్టణంలో స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024లో భాగంగా చేపడుతున్న రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లతో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిఎఒలు వంద శాతం తిరిగి పరిశీలన చేయాలన్నారు. రీవెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 7వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ ఓటు హక్కు తొలగించరాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా బిఎల్‌ఒలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణం, మార్పులు, చేర్పులను ఇంటింటికీ వెళ్లి జాగ్రత్త పరిశీలించి జాబితాలో చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్లు హరిప్రసాద్, ఈరమ్మ, బిఎల్‌ఒలు, పాల్గొన్నారు.

కేశవరెడ్డి స్కూల్లో నలుగురు విద్యార్థులు మిస్సింగ్

బుక్కరాయసముద్రం : మండలంలోని వడియంపేట దగ్గర ఉన్న కేశవరెడ్డి స్కూల్లో చదువుతున్న నలుగురు విద్యార్థులు కన్పించకుండా పోయిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బుక్కరాయసముద్రం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కేశవరెడ్డి రెసిడెన్షియల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మనోజ్ కుమార్, కార్తీక్, మహేష్, చంద్రమౌళి ఉపాధ్యాయులు, యాజమాన్యంకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మంగళవారం నాడు స్కూల్ నుంచి వెళ్లిపోయారు. వీరిలో చంద్రమౌళి అనే విద్యార్థి సాయంకాలం తన సొంత ఊరైన తాడిపత్రికి చేరుకున్నాడు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ఆచూకీ తెలియలేదు. దీంతో స్కూల్ యాజమాన్యం బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విద్యార్థులు ఎవరికైనా కనబడినచో బుక్కరాయసముద్రం పోలీసులు 9440796816, 9392918291, లేదా 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.



పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

జెఎన్‌టియు భద్రతకు పటిష్ట చర్యలు

స్టిక్కర్లు విడుదల చేసిన విసి రంగజనార్ధన

స్టికర్లను విడుదల చేస్తున్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు భద్రతా చర్యల్లో భాగంగా పటిష్ట చర్యలు చేపట్టినట్లు విసి రంగజనార్ధన పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులు, భోధన, భోధనేతర సిబ్బంది వాహనాలకు కళాశాల ఆవరణలోకి ప్రవేశించేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన స్టిక్కర్స్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు ఈ స్టిక్కర్స్‌ను అతికించుకోవాలని తెలిపారు. కళాశాలలో ఇతరుల ప్రవేశానికి గేట్ పాస్‌ను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ఈ స్టిక్కర్స్‌ను అందజేయడం వల్ల భద్రతా ప్రయోజనాలు పెరుగుతాయని, విద్యార్థులలో క్రమ శిక్షణ పెరుగుతుందని తెలిపారు. అనంతరం విసి ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా అధ్యాపకులకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, పిఆర్‌ఒ భానుమూర్తి, భువనవిజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఇన్‌ఛార్జి జిల్లా వైద్యాధికారిణి సుజాత నార్పల బిసి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

విద్యార్థినులకు నాణ్యమైన వేడి వేడి భోజనాన్ని అందించాలని ఇన్‌ఛార్జి జిల్లా వైద్యాధికారిణి సుజాత సూచించారు. మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో సోమవారం సాయంత్రం విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో ప్రజాశక్తి దినపత్రికలో 'విద్యార్థినులకు అస్వస్థత.. నార్పల ప్రాథమిక వైద్యశాలలో చికిత్స' అని ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన జిల్లా వైద్యాధికారిణి సుజాత మంగళవారం హాస్టల్‌కు చేరుకుని ఘటనపై ఆరాతీశారు. అనంతరం వసతిగృహంలో కలియతిరిగి వంటశాల, పరిసరాలు, ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహారాన్ని వేడివేడిగానే వడ్డించాలన్నారు. వండిన తర్వాత ఎక్కువ సమయం నిలువ ఉంచుకోకూడదన్నారు. అన్నం చల్లగైన తర్వాత పెడితే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కావున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని పాఠశాలలు, హాస్టళ్లలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ ఉండాలని మండల వైద్యాధికారులకు సూచించారు. అనంతరం బొందలవాడలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రికార్డులను పరిశీలించారు. అలాగే బి.పప్పూరు ప్రాథమిక వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యులు రవిశంకర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ షహంతాజ్, నార్పల ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సాదియా, సిహెచ్‌ఓ బాలాజీ, సూపర్‌వైజర్ అక్కులప్ప, పప్పూరు ఎంపిహెచ్‌ఒ మల్లికార్జున సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్ఇఒ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం : విస్తారంగా వర్షాలు కురుస్తున్న తరుణంలో సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ఉలవలు, అలసందలు, పెసలు, కొర్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలాల్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మకూరు ఆరోగ్య కేంద్రంలో ఆశా డే

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఇందులో భాగంగా 11 రకాల వ్యాధులకు ఇచ్చే టీకాలు, హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించడం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ఆసుపత్రికి తరలించడం, ఈఆశా యాప్ ద్వారా గర్భిణీ సేవలు, ప్రసవానంతర సేవలు, అంగన్‌వాడీలు, పాఠశాలల్లో ఇచ్చే ఐరన్‌మాత్రలు, సిరప్, విటమిన్-ఎ ద్రావణం పంపిణీ వంటి సేవలను ఎలా నమోదు చేయాలి అన్న అంశాలపై వివరించారు. అనంతరం 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా వైఎస్ఆర్ కంటివెలుగు కార్యక్రమం కింద మండలవ్యాప్తంగా స్క్రీనింగ్ చేసిన 580 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహాసుల్తానా, ఎంపిహెచ్ఇఒలు నాగేశ్వరయ్య, మునాఫ్, సీహెచ్ఓ శమీమ్ తారా, పీహెచ్ఎన్ తులసమ్మ, కంటి నిపుణుడు బాల వెంకటరమణ, ఎఎన్ఎంలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

జెఎన్‌టియు సీనియర్ ప్రొఫెసర్ పి.రమణారెడ్డి

మాట్లాడుతున్న జెఎన్‌టియు సీనియర్ ప్రొఫెసర్ పి.రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విద్య ద్వారానే సమాజంలో పేదరిక నిర్మూలన సాధ్యమని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ పి.రమణారెడ్డి సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇంజినీరింగ్ విభాగం 3వ సంవత్సరం విద్యార్థులు సెమినార్ హాల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యారంగంతోపాటు రాష్ట్రపతిగా అనేక సేవలు అందించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి విద్యార్థులు, అధ్యాపకులు పని చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడు మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈకార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, బోధనా సిబ్బంది బి.విష్ణువర్ధన్‌రెడ్డి, జి.మమత, డి.లలితకుమారి, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య

ఆత్మకూరు : మండల పరిధిలోని ముట్టాల గ్రామానికి చెందిన కె.యల్లమ్మ (28) కడుపునొప్పి తాళలేక మంగళవారం పురుగుల మందు ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యల్లమ్మకు తరచూ కడుపునొప్పి వచ్చేది. ఈనేపథ్యంలో మంగళవారం కూడా కడుపునొప్పి వచ్చింది. దీంతో నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెందిన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎస్ఐ జనార్ధన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని ఆవులెన్న గ్రామానికి దూదేకుల అక్బర్‌సాబ్ (65) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి నారాయణస్వామి, సర్పంచు రామ్మోహన్, ఎర్రిస్వామి, వెంకటస్వామి, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న శోభారాణి

స్టాక్ పాయింట్ పరిశీలన

గుత్తి : పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదామును జిల్లా పౌరసరఫరాల అధికారిణి శోభారాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు, నిల్వలను పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిఐడి కె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDl. SENIOR CIVIL JUDGE,ANANTHAPURAMU
H.M.O.P.NO:204/2022

Between:
Manjula Vijayalakshmi ...**Petitioner**
And
Manjula Venkatesh ...**Respondent**

NOTICE TO RESPONDENT

Manjula Venkatesh S/o Venkataramudu D.No:619-7-1, Ganesh nagar, Main Road, Tadipatri Town, Ananthapur Dist.

పై దావాలోని ప్రతివాది మీ హాజరు నిమిత్తము పై కోర్టు నందు 26-09-2023 తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గాని హాజరై ఏమైన ఆక్షేపణలున్నచో తెలుపుకొన వలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
(By Order of the Court)
M.VISHNUVARDHAN REDDY,
K.CHANDRA SHEKAR RAO
M.ANURADHA
Advocates Ananthapuramu
Cell:9440286591

IN THE COURT OF THE DISTRICT JUDGE: ANANTAPURAMU.
E.P. No.1015/2022 in ARB Case No: ARC/FSBFL/401

Between:
M/s. Five Star Business Finance Limited, Anantapur represented by its Authorized Signatory Y.Shyam Prasad, Anantapur ...Petitioner/ D.Hr

Vs

1.Lakshmi (Borrower) W/o Venkateswarlu H.No.4-1602-1, Kalyandurgam Road, Anantapur Post & Mandal, Ananthapuramu District.
2.Venkateswarlu (Co-Borrower) S/o Nagappa H.No.4-1602-1, Kalyandurgam Road, Anantapur Post & Mandal, Ananthapuramu District.
...Respondents/J.Drs

వేలం ప్రకటన

అర్జీదారుడు తన ఇ.పి. మొత్తమును రాబట్టుటకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నాడు. వేలములో పాల్గొనదలచినవారు 27-09-2023వ తేది ఉ॥ 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

Schedule of the immovable of the 1st J.Dr:

All that piece and parcel of Land Building bearing Plot No.79, situated at Papampeta Village, A.Narayanapuram Panchayat area, Ananthapuram District, Comprised in S.No.43-1 Paiki, Land measuring an extent of 89.056 Sq.yards, out of Ac 0.01.84 Cents and **Boundaries:** North by: Plot No.80, South by: Plot No.78, East by: Plot No.86, West by: Road.

DHr Value: Rs.30,00,000/-
Amina Value: Rs.50,00,000/-
Court Value: Rs.40,00,000/-

(By Order of the Court)

M.Suresh Kumar
Advocate for DHr.
Anantapuramu, Cell: 9441168233.

IN THE COURT OF HON'BLE XXVI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
I.A.NO.1278 of 2021
IN
O.P.No.2797 of 2014

Between:
V.Sharada and others ...Petitioner
AND
B.Bayappa Reddy and others ...Respondents

To,
Kakarla Babu S/o,Subbaiah,
R/o: Sallavaruipally Village, Tadipathri Mandal, Ananthapur District-515411
...Respondents No.3

Take notice that the above petitioners have filed the case against you for grant of compensation for the death of deceased in a motor accident and the case is posted to **15-9-2023** at **10-30** AM for your appearance and counter.If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
H.NO. 16-2-146/14/3,
Malakpet, Hyderabad.
Cell : 9848260446
Counsel for the Petitioner

ప్రజలను చిరునవ్వుతో పలకరించాలి : డీఎస్పీ

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధిత ప్రజలతో పోలీసులు చిరునవ్వుతో మర్యాదపూర్వకంగా పలకరించాలని డీఎస్పీ వెంకటశివారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో పని చేసే సిబ్బంది ప్రతి ఒక్కరూ ఓ ఎస్ఐలా భావిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ఇటీవల శింగనమల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా.. లేదా.. చూసుకోవాలన్నారు. అలాగే చోరీలు, జూదాలు, మట్కా, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పని చేస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాత్రిపూట బీట్‌లు, పెట్రోలింగ్ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చిదంబరయ్య, హెడ్ కానిస్టేబుల్ తిమ్మరాజు, ఆనంద్, గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయలతో చక్కటి ఆరోగ్యం

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

గ్రామీణ ప్రాంతాల్లో లభించే కాయగూరల ద్వారానే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ సూచించారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పిల్లలపల్లి, వేపులపర్తి అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్ఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మునగ ఆకు, ముల్లంగి, క్యారెట్, బీన్స్, చిక్కుడు, సోయాబీన్, వేరుశెనగ తదితర వాటిల్లోనే పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుసప్ప, స్కూల్ స్కూల్ కమిటీ ఛైర్మన్ శరణప్ప, అంగన్వాడీలు వెంకటలక్ష్మి, ఎర్రమ్మ, శృతి, లక్ష్మి, దేవేంద్రమ్మ, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

శింగనమల : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్త టి.రత్నమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని సోదనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణను గర్భిణులు, బాలింతలు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖంయగా మునగాకు, ఆకుకూరలు, క్యారెట్, బీన్స్ వంటి పప్పుదినుసులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ బి.సరస్వతి, ఆయా రామాంజనమ్మ, రేణుకమ్మ, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల మండలం సోదనపల్లి అంగన్‌వాడీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ రత్నమ్మ, చిన్నారులు

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి నిర్మలామురళి మాట్లాడుతూ బిజీ.మస్తాన్‌సాహెబ్ వర్ధంతిని పురస్కరించుకుని కుమారుడు నబి రసూల్, కుటుంబ సభ్యుల ఆర్థికసాయంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, నబిరసూల్, నల్లప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆచార్యులకు సన్మానం

జెఎన్‌టియు ప్రొఫెసర్ వి.బి.చిత్రను సన్మానించి మెమొంటోను అందజేస్తున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

అనంతపురం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో అనంతపురం జెఎన్‌టియు ఆచార్యులు ఆర్.పద్మ సువర్ణ, వి.బి.చిత్రకు ఉత్తమ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శాలువాలు కప్పి సత్కరించారు. జెఎన్‌టియులో పని చేస్తున్న అధ్యాపకులకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు రావడం సంతోషకరమని ఉపకులపతి జి.రంగజనార్ధన తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతితోపాటు రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర, యూనివర్సిటీ డైరెక్టర్లు అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారంపై దృష్టి సారించాలి

కిమ్స్ సవేరా ఆసుపత్రి కన్సల్టెంట్ డైటీషియన్ టి.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ తగిన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యకరమైన జీవనశైలికి అలవాటు పడుతారని కిమ్స్ సవేరా ఆసుపత్రి కన్సల్టెంట్ డైటీషియన్ టి.నాగలక్ష్మి సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించే జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ పోషకాహారంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికే వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మనం తినే ఆహార పదార్థాల్లో కార్బొహైడ్రేట్స్, ప్రోటిన్స్, మైక్రో, మాక్రో న్యూట్రిన్స్, ఫైబర్ (పీచు పదార్థాలు), కొవ్వు పదార్థాలు, యాంటి ఆక్సింటెట్స్ ఉండే చూసుకోవాలన్నారు. కాగా సింగిల్ పాలిష్ పట్టిన బియ్యం ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం అన్నారు. అలాగే దుంపకూరలు తీసుకోవాలన్నారు. మనిషికి సరియైన శరీరాకృతి కోసం సమృద్ధిగా ప్రోటీన్స్ కలిగి ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. సోయాబిన్స్, సోయా పన్నీర్, సోయా మిల్క్, సోయా పెరుగు, పెసలు, అలసందలు, శెనగలు, కబుళి శెనగలు, మినపప్పు, వేరుశెనగ గింజలు, ఉలవలు, కందులు, సోయాబిన్స్ కలిపిన గోధుమలు, జొన్నల పిండితో చేసిన రొట్టెలు, చపాతీలు ఆరోగ్యానికి చాలా మంచి అన్నారు. వీటితోపాటు మటన్, చికెన్, చేపలు, రొయ్యలు, గుడ్లు తీసుకుంటే ప్రొటీన్లు పెరుగుతాయన్నారు. అతిముఖ్యంగా చిన్నప్పటి నుంచి చిరుధాన్యాలు, జొన్నలు, సజ్జలు, రొట్టెలను అలవాటు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం తగదు : ఎస్ఎఫ్ఐ

నార్పల : విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటం తగదని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టళ్ల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఇటీవలి కాలంలో హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ ఘటనలు సర్వసాధారణం అయిపోయాయన్నారు. సోమవారం కూడా నార్పల బాలికల వసతి గృహంలో ఫుడ్‌పాయిజన్ చోటు చేసుకుని విద్యార్థులు ఆసుపత్రిపాలు కావడం బాధాకరమన్నారు. వరుసగా ఫుడ్ పాయిజన్ కేసులు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవరించడం బాధాకరమన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ అస్వస్థతకు కారణమైన వారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ మధుసూదన్, అధికారులు

బాల్యవివాహాలను అరికడదాం

అనంతపురం : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌డిఒ మధుసూదన్ పిలుపునిచ్చారు. మహిళా, శిశుసంక్షేమ శాఖ పీడీ బి.ఎన్.శ్రీదేవి అధ్యక్షతన బాల్యవివాహాల నిషేధ చట్టం-2006కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గ్రామస్థాయిలో విఆర్ఒ, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. వీరందరూ గ్రామాల్లో ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే కలిగే అనార్థాల గురించి వివరించాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ శ్రీదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాల్య వివాహ నిలుపుదల, కొత్త జీవో ఎంఎస్ 31 గురించి కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ రామలక్ష్మి, డిసిపిఒ సుబ్రమణ్యం, అనంతపురం అర్బన్ సిడిపిఒ లలితమ్మ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఒ కార్యాలయం ప్రారంభం

ఐసిడిఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నార్పల : మండల కేంద్రంలోని చేయూత మహిళా మార్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాన్ని వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ మంగళవారం ప్రారంభించారు. గతంలో శింగనమలలో ఉన్న ఐడిసిఎస్ కార్యాలయం నార్పల నూతన సెక్టార్ కావడంతో ఇక్కడే ఏర్పాటు చేసినట్లు సిడిపిఒ భారతి తెలిపారు. నార్పలలో కార్యాలయం ఏర్పాటు కావడంతో అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ, నిర్వహణ సులువు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుప్రియ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న వైసిపి నాయకులు రమణారెడ్డి, పిఇటి గోపాల్‌రెడ్డి

బుక్కరాయసముద్రం : పూర్వ విద్యార్థి సింహాద్రికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ పిఈటి గోపాలరెడ్డి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి సింహాద్రి మంచి క్రీడాకారుడు అన్నాడు. సింహాద్రి ప్రస్తుతం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ చదువుతున్నాడన్నారు. ఈనేపథ్యంలో కోర్సుకు సంబంధించిన ఫీజు రూ.5వేలు కట్టాలి. దీంతో విద్యార్థి ఇబ్బందులను గుర్తించిన పీఈటీ గోపాల్‌రెడ్డి రూ.5వేలను వైసిపి నాయకుడు ఆలూరు రమణారెడ్డితో కలిసి అందజేశారు. దీంతో పీఈటీని జడ్పీటిసి భాస్కర్, వైసిపి నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, సర్పంచి పార్వతీ, హెచ్ఎం వసుంధర, ఎంపీటీసీ కాలవ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సమాధులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు : మండల పరిధిలోని జి. కొట్టాల గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటికలోని సమాధులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు పవిత్రంగా చూసుకునే సమాధులను గ్రామానికి చెందిన అగ్రవర్ణ సామాజిక వర్గానికి చెందిన వారు ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్గిలి రమేష్‌బాబు, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు నరసింహులు మాదిగ, రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు మాదిగ, రాయలసీమ దళిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు తగరం రామాంజనేయులు, ఎపి సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, దళిత ఐక్యవేదిక నాయకులు వై.ఆనంద్, రాయలసీమ ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం, ప్రజా సేవాసంఘం నాయకులు నరసప్ప, మాజీ సర్పంచి చంద్రశేఖర్, దళిత నాయకులు జి.శ్రీనివాసులు, నాగేంద్ర, రవికుమార్, కిష్టప్ప పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం : ఎమ్మెల్యే

శింగనమల : సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని ఎమ్మెల్యే జొన్నలగడ పద్మావతి తెలిపారు. మంగళవారం మండలంలోని గుమ్మేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, రమణారెడ్డి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులపై దాడులను అరికట్టాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో దళిత, గిరిజనులపై దాడులు, అత్యాచారాలు, స్థలాలు, ఇల్లు, భూమి అక్రమాలు అరికట్టాలని ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ సిఐని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం దళిత, గిరిజనుల సమస్యలపై సిఐకి వివరించారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లుట్ల రామకష్ణ, బండారు ఈశ్వరయ్య, మీనుగా మలరాయుడు, రాము, వీడియో శివ, నరసింహ, సప్లయర్స్ శివ, పుష్పరాజు ఉన్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని తక్కల్లపల్లి, ఎస్.గూడూరు సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా, జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లు : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మభ్యపెట్టి మోసాలకు పాల్పడే వారి పట్ల నిరుద్యోగులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ యు.నరసింగప్ప సూచించారు. ఎస్పీ ఆదేశాలు మేరకు మంగళవారం స్థానిక రైల్వే ఇన్సిట్యూట్‌లో 2వ పట్టణ సిఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల పేర మోసం చేసే వ్యక్తులు ఎక్కువ అయ్యాయన్నారు. ముఖ్యంగా రైల్వేశాఖలో పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తమకు తెలుసు అని డబ్బులు ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్నారన్నారు. కావున ప్రజలు, విద్యార్థి, విద్యార్థినులు మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అనంతపురం : నగరంలోని న్యూ బాలాజీ ఫర్టిలైజర్ ఫెస్టిసైడ్స్ దుకాణాన్ని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎవరైనా అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు వేలం

యాడికి : వివిధ సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం స్థానిక కొత్త పోలీస్‌స్టేషన్‌లో వేలంపాట నిర్వహించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 4 మోటారు సైకిళ్లు, మరో కారు వేలం వేయగా రూ.50,622 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే అనేకమందికి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా పింఛన్లు మంజూరు కాని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుప్రియా, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, పింఛన్‌దారులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ గ్రామ సచివాలయంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరికైనా రాకుంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సోమయ్య, ఎంపిటిసి ఓబులేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, షేక్షావలి, నాయకులు కరణం భీంరెడ్డి, మాళ్యం ఎర్రన్న, పెన్షన్‌దారులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో అలరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుం, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, మహేష్, ప్రైమరీ ఇన్‌ఛార్జులు నీరజ, భారతి, తేజస్విని, ఎఒ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే సంఘమేష్ నగర్, గుత్తిరోడ్డులోని మాంటిస్సోరి విద్యాసంస్థల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాల, బాలికలు రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు .

అలాగే కళ్యాణదుర్గంలో రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంతోపాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ముందస్తుగా మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో ఎంపిడిఒ రామచంద్ర, ఎంఇఒలు మల్లారెడ్డి, హరికృష్ణ, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, తదితరులు శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్-1లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుడు కవిరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయ బృందం సంధ్య, శైలజ, భారతి, రషీదా, నాగవేణి, ఎం.శైలజ, రోజా, ఇందుప్రియ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని ఎవిఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపాల్ విక్రమ్‌బాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అంతకుముందుఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం మాంటిస్సోరి పాఠశాలలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన 'సర్వేపల్లి'

ఉపాధ్యాయ దినోత్సవంలో జెఎన్‌టియు విసి రంగజనార్ధన

జెఎన్‌టియులో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విసి రంగజనార్ధన, అధ్యాపకులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన ఘనత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ దక్కుతుందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జెఎన్‌టియులోని ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వత్తికి తెచ్చిన గుర్తింపు, గౌరవానికి ప్రతీకగా ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజున ఉపాధ్యాయ దినోత్సవాన్ని చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, యూనివర్సిటీ డైరెక్టర్లు ఇ.కేశవరెడ్డి, పి.సుజాత, ఆర్.కిరణ్మయి, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎ.సురేష్‌బాబు, బి.దుర్గాప్రసాద్, జి.వి.సుబ్బారెడ్డి, వర్సిటీ పరీక్షల విభాగం బి.చంద్రమోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, ఆడిషనల్ కాంట్రోలర్స్ జె.శ్రీనివాసులు, జసిక సరిత, వివిధ విభాగాల అధిపతులు చంద్రమోహన్‌రెడ్డి, అరుణ, భువనవిజయ, ఎం.రామశేఖరరెడ్డి, బోధనా సిబ్బంది ఎం.అంకారావు, ఆర్.రాజశేఖర్, మాజీ ఆచార్యులు వి.శంకర్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని వసుంధరాదేవి ఆసుపత్రి వెనుక ఉన్న లోటస్ కిడ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ నిర్మల ఆనంద్, పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య, సుమా, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మూడవ రోజులోని సాయి విజ్ఞాన్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కరుణాకర్ బాబు, ఎంపీ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ లావణ్య రామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అశోక్‌నగర్‌లో ఉన్న సాయిబాబా మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయురాలిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగరూరు ఉస్మాన్, ఇమ్రాన్, ఇర్షాద్, చరణ్, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల, ఆచార్య ఎన్‌జి రంగా వ్యసాయ విశ్వ విద్యాలయాల వజ్రోత్సవాల్లో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, గురువులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, ఆచార్యులు రామకృష్ణ, రామస్వామి, విద్యార్థి వ్యవహారాల ఇన్‌ఛార్జి కొండారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీచైతన్య బాలికలు రెసిడెన్షియల్ స్కూల్‌లో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, సి.బ్యాచ్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్, అకాడమీ కోఆర్డినేటర్ నాగభూషణం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర చాలా కీలకమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీవితం ఎందరికో ఆదర్శనీయమన్నారు. ప్రతి వ్యక్తికీ ఉపాధ్యాయులతో అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. ఎన్ని తరాలు మారినా ఉపాధ్యాయుల పాత్ర మారదన్నారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ,, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మండలంలోని మెలకలపెంట గ్రామంలో ఎంపిపిఎస్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న లక్ష్మీప్రసాద్‌ను జెవివి వ్యవస్థాపక సభ్యులు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్ విద్యార్థులు బోధనలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చి విద్యార్థుల ఉన్నత శిఖరాల అభ్యున్నతకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మా రెడ్డి ఉపాధ్యాయుల రమేష్, హెప్సిరాణి, తులసి తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అని సిద్ధాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, రాయప్ప, హనుమంతరాయుడు, విశాలాక్షి, రాధాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఉరవకొండ సెంట్రల్ హైస్కూల్లో పనిచేస్తున్న హెచ్.రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఆనంద్‌రాజు, గోపాల్, మోపిడి వన్నురుస్వామి, పీసీ ప్యాపిలి తిప్పేస్వామి, పెద్ద ముష్టూరు అర్జునప్ప, ఉరవకొండ రామాంజనేయులు, కౌకుంట్ల గుర్రం రామాంజనేయులు, డాక్యుమెంట్ రైటర్ లాల్‌ప్రసాద్, కోనాపురం ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

బెళుగుప్ప : ఉపాధ్యాయ మృత్తికే వన్నెతెచ్చిన మహానుభావుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఎంపిడిఒ రామచంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక సన్‌రైజర్స్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిరిపురం నాగరాజు, ఎంఇఒలు మల్లారెడ్డి, హరికృష్ణ, ఉపాధ్యాయుడు కవిరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయ బృందం సంధ్య, శైలజ, రషీదా, నాగవేణి, భారతి, గౌతమి, రోజా, ఎం.శైలజ, ఇందుప్రియ, ఎర్రిస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : జ్ఞానాన్ని పంచే సమాజ శిల్పులు ఉపాధ్యాయులు అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలక కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ నీలం భాస్కర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, సర్పంచు పార్వతి, ఎంపిటిసి కాలవ వెంకటలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయులు నాగరాజుగౌడ్, గోపాల్‌రెడ్డి, పెద్దన్న, పుల్లన్న, నాగరాజు, ఆనంద్, నీలకంఠారెడ్డి, లలితమ్మ, మంజుల, సునీత, పద్మావతి, వైసిపి సీనియర్ నాయకులు ఆలూరు రమణారెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, జెసిఎస్ మండల కన్వీనర్ బయ్యపురెడ్డి, లక్ష్మీనారాయణ, చెదుళ్ల సర్పంచు శ్రీనివాసురెడ్డి, బండి పురుషోత్తం, చేపల రమణ, మనేరు కొండమ్మ, పెద్ద కొండయ్య, మండల శివ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి పద్మవాణి పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిసున్న తహశీల్దార్ మునివేలు, ఎంఇఒ నాగరాజు, కరస్పాండెంట్ జి.నాగపీరయ్య

గుత్తి : మండలంలోని బేతాపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఓబుళపతి అధ్యక్షతన మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సులోచన, శివప్రసాద్, సాధన, రవీంద్రనాథ్‌రెడ్డి, నరేంద్రగౌడ్, నిరుపమ, చంద్రకళ, రామకృష్ణయ్య, రత్నకుమారి, మాదన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘ భవన్‌లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షన్ల సంఘం మండల అధ్యక్షుడు కె.అబుబకర్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు షేక్షావలి నారాయణరెడ్డి, విజయభాస్కర్, హుస్సేన్‌అహ్మద్, చెన్నారెడ్డి, గోవిందప్ప, నారాయణశెట్టి, నరసింహులు, గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న పద్మవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ మునివేలు, ఎంఇఒ నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ జి.నాగపీరయ్య, ఉపాధ్యాయురాలు అలీమా, తదితరులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. అంతేగాకుండా నైతిక విలువలు పాటిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. అనంతరం 2022- 23 టెన్త్ ఫలితాల్లో నూటికి నూరు మార్కులు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు ఆంజనేయప్రసాద్, రాజ కుల్లాయప్ప, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు తదితర ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సన్మానించారు. తర్వాత వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాయదుర్గం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ముందు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంబాజీరావు, కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి పేర్మి సత్యనారాయణ, క్లబ్ సభ్యులు రవికుమార్, మోహన్, శ్రీనివాసులు, శంకర్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సర్వేపల్లి చిత్రపటానికి ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమా పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి సర్వేపల్లి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యావేత్త, రాజకీయ వేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడిగా, ఉప రాష్ట్రపతి, అనేక సేవలు అందించారని కొనియాడారు. సోవియట్ రష్యా యూనియన్‌కు రెండవ రాయబారిగా పని చేసారని గుర్తు చేవారు. భారతరత్నతో పాటు ఎన్నో అవార్డులు పొంది పేరెన్నిక పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లులో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న జెవివి నాయకులు



బుక్కరాయసముద్రంలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, తదితరులు

జిల్లా గ్రంథాలయంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిసున్న ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి, తదితరులు